# “ఛాయ”

చొక్కానహళ్లి విజయరావు

నిజమే, ఆవిడకు రాకూడదని కష్టమే వచ్చింది. అదేమిటో స్త్రీలు చావైనా తప్పించుకో గలరేమోగాని, పెండ్లిమాత్రం తప్పించుకోలేరు. జీవితాన్ని ఆనందముగా గడుప వలయుననియే ప్రయత్నిస్తారు. ప్రతి పురుషుడు, స్త్రీ. ఆనందం ఇచ్చే వస్తువును పోగొట్టుకొన్నామంటే ఇక మన జీవనజ్యోతి ఆరిపోయినట్లే. ఆనందం, ఆనందం, ఎక్కడ్నుంచి వస్తుంది ఆనందం? అపరిమితానందంలో మునుగుతూ తేలుతున్న చాయ, ఇప్పుడు కన్నీటి ధారలతో మునిగిందంటే ఎవరైనా నమ్మేవిషయమేనా? నిజాన్నిబట్టి నమ్మవలసి వచ్చింది. మొన్ననే కదూ, మూర్తి చాయను విడిచి లా పరీక్ష చదువుకుగాను వెళ్ళింది పూనాకు. మూర్తిక్రొత్త వాడుకాడు చాయకు.

మూర్తి తల్లి దండ్రులు చిన్నప్పుడే చనిపోయారు. మేన మామ శివరావుగారింట్లో పెరుగుతూ వచ్చాడు. చాయ ఒక్కతే కన్యారత్నం శివరావ్ గారికి. పదునాల్గు సంవత్సరాలు. యింగ్లీషువిద్య నేర్చుకొంది. చక్కనిచుక్క. మూర్తికి పద్ధెనిమిదేళ్ళుంటాయి. నిజంగా వీరిరువురు చిలకా గోరింకల్లాగ వుండేవారు. వీరిరువురి అందము జతచూచి, పెండ్లచెయ్యాలని ఊహించుకొని యుండేవారు శివరావ్ గారు. అయితే శివరావ్ ఇల్లాలు మణిక్యమ్మకు ఎంతమాత్రం అయిష్టత, మూర్తికి చదువున్నా స్థిరాస్తి లేదని.

దినములు దొర్లిపోయాయి. మాసములు పరుగిడినయి. ఇంతట్లో ఎక్కణ్ణించో కాచుకొని యున్నట్లు మృత్యుదేవతవచ్చి శివరావ్‌ను ఎకురొక్కంది. చాయకు మరింతగా కష్టాలు ఆవరించాయి. ఎప్పుడూ తన్ను విడనాడనని మూర్తికూడ ఇప్పుడు లేకపోయాడు.

మూర్తినుంచి అనుదినము ఉత్తరాలు వస్తూవుండేవి మన చాయకు. ఉత్తరాలతో శాంతింప కుండేది చాయా అంతరాత్మ. ఆమెకు ఇంతట్లోచాయాకు పెండ్లి చేయాలని, గొప్పయింటి సంబంధాన్ని నిశ్చయ పరచింది మాణిక్యమ్మ. ఆమెకు యీ సంబంధం అయిష్టత. ఎందరో గొప్ప గొప్పవారు చాయాచేతిని యాచించారు. కాని ఆమె పవిత్రంగా మూర్తిని కోరుకుంది.

వేసవి శెలవులకు మూర్తి మెయిల్లో బయలుదేరి యింటికివచ్చాడు. ముసి ముసి నవ్వుతో చాయ, మూర్తి కెదురేగి, తన గదిలోకి తీసికెళ్ళి కాఫీఅందిచ్చింది. మూర్తి సోఫాలో కూలబడి, పైనించి క్రిందిదాకా తేరిపారిచూచి, ముఖాన్ని ఒక్క నిమిషం పరీక్షించి “ఎంతలో ఎంత మారిపోయావు. చాయా!” అని ప్రశ్నించాడు. ఆ మాట లామె చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. ఆమె చెక్కిళ్ళు అంతా తడిసినై. ఆమె హృదయంలోని ఆలోచనకు బదులుగా, ఆ ఎఱ్ఱని చిన్న పెదవులు ఆకుల్లా కదిలేవి.

మూర్తి, ఆమె ముఖాన్ని యెత్తి, మెత్తని బుగ్గల్ని ఆరాటంతో వెతుక మొదలెట్టాడు. చెదిరిన ముంగురిల్ని పైకితోస్తూ, తన కౌగిలిలో తీసుకొని హృదయానికి అదుముకొన్నాడు. పిచ్చి పిచ్చి నవ్వులు, క్రొత్త క్రొత్త విషయాలు మాట్లాడు కొంటున్నాయి వారిరువురి హృదయాలూను. ఒకరి హృదయం వొకరికి లొంగిపోయింది. నేను నిన్ను ప్రేమించాను అంటాడు నాయకుడు. నేను నిన్ను ప్రేమించాను అంటుంది నాయకి. చాయా, మూర్తి కౌగిలిలోంచి ఎల్లానో తప్పించుకొని ప్రక్కగదిలోకి పారిపోయి, తన ముఖాన్ని అద్దంలో చూసుకుంటుంది. ఆ లేత బుగ్గలు ఎర్రగా కందిపోయివున్నయి. సిగ్గుపడుతుంది, ఇద్దరూ ఒక్కమారుగా కడుపులు చెక్కలయ్యేటట్లు విరగపడి ఒక నవ్వు నవ్వుతారు. ఇరువురి ఆశా జ్యోతి మెరుపు తీగవలె మెరసి పోతూంది.

వేగు చుక్క పొడిచింది. తెల్లవారింది. ఉదయ భానుని కిరణాలు, వారిరువురు పండుకొనియున్నగది గవాక్షములోకి ప్రాకి ఇరువుర్ని లేపింది. మూర్తి సెలవులు గడిచాయి. పూనాకు వెళ్ళిపోయాడు. మూర్తిలేనిది చాయాకు దుర్భరంగావుంది. వీరిరువురి హృదయ భావాలు తెలుసుకోక, మాణిక్యమ్మ చాయను ఒక గొప్ప ధనవంతునికిచ్చి నిర్బంధంగాపెండ్లి చేసేసింది. ఆమె మనస్సును అనిర్వచ నీయమైన ఆవేదన ఆవరించింది. ఆనాడు మూర్తితో చేసిన శపథం, జ్ఞాపకానికి తెచ్చుకొంది. జీవితాన్ని ఆహుతిగా ఇచ్చుటకు కూడా సిద్ధంగావున్నానని ఆమె నొక్కి చెప్పింది. చాయను యే క్షణము లోనూ విడువనని, కష్టసుఖాలలో తోడు నీడౌతానని, తప్పక పెండ్లి చేసుకొంటానని మరి ఇంకా ఎన్నో శపథాలు చేసాడుమూర్తి. యెటుచూచిన ఆశాకిరణపుజ్యోతి కనబడేది కాదు చాయాకు మూర్తిలేనిది. తల్లి పిచ్చితనాకి కట్టతెగనియేరులాగ, దుఃఖం పొంగి పొరలి పోతూంది. మనోవ్యాధిచే మంచం పట్టింది.

దిన దినానికి మనోవ్యాధి తీవ్రస్థితి దాలుస్తోంది.

ఒకనాడు మధ్యానం, మూర్తి తన గదిలో నుంశగా, ఎవరో తన్ను పేరుపెట్టి పిల్చినట్లు వినుపించింది. ఒక ఉత్తరం అందిచ్చాడు పోస్టుప్యూన్. అది చాయ వ్రాసినఉత్తరం.

ఆ ఉత్తరంలో:

"అబ్బా! చెప్పుకోలేను. సిగ్గుభయం వొక్కమాకు నన్ను కబళించివేస్తున్నవి. నేనిక జీవన్మృతనైనా. మిమ్మును మనసారప్రేమించిన నా ప్రేమ పుష్పం వాడి పోవలసినదే. మీకు తప్ప నాహృదయంలో మరెవ్వరికి కించిత్ తావులేదు. నా పిచ్చి తల్లి నాకు నిర్బంధ... పెం......డ్లి...... చే... సే... సిం... ది. మీ మీదప్రేమచే మీతో చెప్పగలిగాను. మీ కడసారి చూపు కోసరం నా అంతరాత్మ చాలా ఆతురత పడుతోంది. మృత్యుదేవత నాకై నిరీక్షిస్తోంది. నిముషాలపై గడుపుతున్నాను. తక్షణం బయలుదేరి రావలసింది.

ఇట్లు

చాయ,

మూర్తి ముఖ మండలాన్ని విషాద నీరదాలు ఆక్రమించుకొన్నాయి. ఆమె విగ్రహం కన్నులకు కట్టినట్లు ఒక్కమారు స్మృతి పథమున మెరసింది. చాయను తనెంతగా ప్రేమించాడో ఆయనకే తెలియక పోయింది. చాయా కోసరం అంతులేని ఆవేదన పడుతుంది హృదయం. తక్షణమే బయలుదేరివెళ్లి చాయను కలుసుకొన్నాడు. ఆమె పరుండిన గదిలోకెళ్ళి, చాయా! చాయా! అని కేకవేశాడు. చాయా, మూర్తి కంఠ ధ్వని విని తెరువలేక కండ్లు తెరచిచూచింది మూర్తిని. ఆమెకళ్ళలో ఒక విధమైనచూపు, ఆలోచన, నిస్సారము, ఉన్నట్లుతోచింది మూర్తికి. ఇద్దరు కళ్ళు నీళ్ళతో నిండాయి. చాయా దుఃఖాన్ని దిగమ్రింగి హృదయ భారాన్ని భరించింది. గుండె నీరసించింది. మాటలు రాక ఆమె తన చేతిని మూర్తి వైపు చాచి కలుపుకొంది. కాలుసేతులు చలవెక్కనై. పెదవులు తడి ఆరిపోయినై. కుంభవృష్టిగా వాన, పైగా కారుచీకటి, మిణుకుమిణుకుమని వెలుగుతూవుండిన దీపం గాలికి వణక నారంభించింది. ఏక దృష్టిని మూర్తిపై నిలబెట్టింది. ఆ చూపుల్లోనే చాయా ఈ విశాల ప్రపంచాన్ని వదులుకొంది. మూర్తి, అమృతకళేబరముపై బడి వెక్కివెక్కి విలపించాడు. ఇంతలో దూరానఉన్న కారుమబ్బులు నలుగడలు విశాల ప్రపంచాన్నంతా అలము కొన్నాయి.




చేతిపనుల
వర్తక రహస్య బోధిని

సబ్బులు, సెంటులు, పరిమళ తైలములు, ఘాణసంచ, అత్తరు, పన్నీరు, పిప్పరమెంటు, మందులు మొదలగునవి సులభముగా తయారుచేయు పరిశ్రమలు 500 గలవు. ధర 1 రూపాయి పోస్టుఖర్చులు 5 అణాలు.

కొక్కోకము

స్త్రీ పురుష రహస్యములు 64 చిత్రపటములతో 302 పేజీలుగల పెద్ద పుస్తకము. ధర రు 1-0-0. పోస్టు ఖర్చు రు. 0-5-0 లు. ఇందులో స్త్రీపురుష శృంగార రహస్యములు, శయ్యాగృహ మర్మములు గలవు.

కుట్టుపని స్వబోధిని

కోట్లు, ట్రౌజర్లు, షర్టులు, జాకెట్లు కత్తిరించి కుట్టు క్రొత్తపద్ధతులు డ్రాయింగులతో గలదు. స్త్రీలు, పురుషులు, బాలికలు యీ గ్రంథముచూచి సులభముగానభ్యసించతగినది. ప్రతిదర్జీ వారికిని ముఖ్యముగా చేతిలోవుండవలసిన పుస్తకము. ధర అ. 10.

మహారాజ. పుస్తకశాల
12 అరుణాచల మొదలి వీధి. 18 బీటు. మద్రాసు.